# అంధకారం నుంచి పుట్టు అంధులకు విముక్తి

## నేత్రదృష్టిని ప్రసాదించిన 'గౌతమి'

**రాజమండ్రి, ఆగస్టు 16, ప్రభాతవార్త**

అంధత్వ నివారణకు ఉచిత సేవలందిస్తోన్న రాజమండ్రిలోని గౌతమి నేత్రాలయం వైద్యులు నిరుపేదలైన ఆరుగురు పుట్టుకనుంచి అంధులైన చిన్నారులకు కంటిచూపును ప్రసాదించారు. పుట్టినప్పటి నుంచి చీకట్లోనే వున్న ఆ చిన్నారులు స్వాతంత్ర్యదినోత్సవం రోజున ప్రపంచాన్ని చూడగలిగారు. విశాఖపట్నం జిల్లా నక్కపల్లి గ్రామం రెల్లి కులానికి చెందిన చిన్నారులకు కంటి శస్త్ర చికిత్స ద్వారా కంటి చూపును రప్పించారు. ఇది చాలా అరుదైన విషయమని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ ఆరుగురు చిన్నారులు దగ్గర బంధువులు కావడం విశేషం. ఒకే కటుంబానికి చెందిన బంగారు దేవి (10), బంగారు గంగా భవాని (6), బంగారు అంజిబాబు (4), మరొక కుటుంబానికి చెందిన బంగారు లోవరాజు (16), బంగారు రమణ (11), ఇంకొక కుటుంబానికి చెందిన బంగారు గంగరాజు (10) వీరంతా దగ్గర బంధువులు.

గతంలో ఇదే ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత శిబిరంలో తన కుమారుడికి కంటిచూపు పొందిన ఒక రిక్షా కార్మికుడి ద్వారా వచ్చి ఈ చిన్నారులు వైద్యం పొందినట్టు గౌతమి నేత్రాలయం వైద్యులు డాక్టర్ జీ మాధవి, డాక్టర్ మధు విలేకర్లకు తెలిపారు. జిల్లాలో 48 లక్షల జనాభాలో 16 సంవత్సరాల లోపు పిల్లలు వుండగా, వీరిలో 2,700 మంది అంధులుగా వున్నారని, వీరిలో 10శాతం శుక్లాలతో 270 మంది కంటిచూపును కోల్పోతున్నారన్నారు. తెల్లకార్డులు ఉన్న పేదలకు, తక్కువ పెన్షన్ పొందుతున్న వృద్ధులకు గౌతమి నేత్రాలయంలో ఉచితంగా కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేస్తున్నామని ఈ అవకాశన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం ఉదయం ఈ ఉచిత చికిత్స శిబిరాన్ని సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అంధత్వ నివారణలో 'గౌతమి' చేస్తోన్న ఉచిత సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్స ద్వారా కంటి చూపు పొందిన చిన్నారులకు ఎమ్మెల్యే కళ్ల జోళ్లు, చుక్కల మందులు పంపిణీ చేశారు. త్వరలోనే రాజమండ్రిలో గౌతమి నేత్రాలయం ఆధ్వర్యంలో ఒక మెగా ఉచిత నేత్ర చికిత్సశిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అరవ సురేష్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్లా షరీఫ్, కోటంశెట్టి సత్యనారాయణ, మార్గాని రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శస్త్ర చికిత్స ద్వారా కంటిచూపు పొందిన చిన్నారులతో నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ జి.మాధవి

### కంటిచూపు వచ్చింది ఇక బడికి పోతా

గౌతమి నేత్రాలయంలో శస్త్ర చికిత్స ద్వారా అంధత్వం నుంచి విముక్తులైన ఆరుగురు చిన్నారులను పలుకరించగా వారు అన్నీ చూడగలుగుతున్నాము ఇక బడికి పోయి చదువుకుంటామని పేర్కొన్నారు. అమ్మ, నాన్నలను కూడా చూడలేకపోయాం..ఇపుడు చూస్తున్నామన్నారు.

వార్త గురువారం 17, ఆగస్టు 2006